నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ శుక్రవారం 13 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 12 : సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి గురువారం సాయంత్రం సీజనల్ వ్యాధులపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మండలాలవారీగా వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖల అధికారుతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా వైద్యాధికారి రాజేందర్, జడ్పీ సీఈవో గోవింద్, ప్రధాన దవాఖాన సూపరింటెండెంట్ సునీల్, నిర్మల్, భైంసా మున్సిపల్ కమిషనర్లు రాజు, రాజేశ్ కుమార్ పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలి

మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్

ఎదులాపురం, సెప్టెంబర్ 12 : ప్రతిపక్ష నాయకులపైన రేవంత్‌రెడ్డి పక్కా ప్లాన్‌గా చేసి దాడులను ప్రోత్సహిస్తున్నాడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మండిపడ్డారు. ఈ సందర్భంగా గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ఆగడాలను తీవ్రంగా వ్యతిరేకించారు. ఖమ్మంలో వరద బాధితులను పరామర్శించడానికి వెళ్లిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్వర్ రెడ్డి, పువ్వాడ అజయ్‌లపై కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడడం సిగ్గు మాలిన చర్య అని పేర్కొన్నారు. కౌశిక్ రెడ్డిని కాంగ్రెస్ ప్రభుత్వం హౌజ్ అరెస్ట్ చేసిందని, అరికెపూడి గాంధీ మాత్రం తన అనుచరులతో మీడియా ముందుకు వచ్చి కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్తున్నా అని బహిరంగంగా ప్రకటించడం నేటి తరానికి ఆయన ఇచ్చే సందేశం ఏంటని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి రౌడీ పాలన చేయడం ద్వారా హైదరాబాద్‌లో శాంతి భద్రతలు కరువయ్యాయని తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నాయకులపైన దాడులు మానుకోవాలని, లేనియెడల ప్రజాక్షేత్రంలో నీ అహంకారానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరిస్తున్నామని పేర్కొన్నారు.

రేషన్ దందా

ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని భోరజ్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

- మహారాష్ట్రకు అక్రమంగా రవాణా
- భోరజ్ చెక్‌పోస్టు వద్ద 280 క్వింటాళ్లు పట్టివేత

ఆదిలాబాద్, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా మీదుగా మహారాష్ట్రకు రేషన్ బియ్యం అక్రమంగా రవాణా అవుతున్నాయి. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన కొందరు వ్యాపారులు ఈ దందాను కొనసాగిస్తూ లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. గురువారం నిర్మల్ నుంచి మహారాష్ట్రకు లారీలో తరలిస్తున్న 280 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని భోరజ్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. నిర్మల్ పట్టణంలోని అన్నపూర్ణ రైస్‌మిల్ ట్రేడర్స్ నుంచి మహారాష్ట్ర గోండియాలోని విలాస్ రైస్ మిల్లుకు ఈ బియ్యం రవాణా చేస్తుండగా.. అధికారులు ముందస్తు సమాచారంతో స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైస్ మిల్లర్లు ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని బియ్యం వ్యాపారులు, దళారులతో కుమ్మక్కై ఈ అక్రమ బాగోతాన్ని నడిపిస్తున్నారు. ప్రభుత్వం ప్రతి కుటుంబంలో ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున బియ్యం సరఫరా చేస్తున్నది. ప్రతినెల మొదటివారంలో ప్రారంభమైన బియ్యం పంపిణీ 15వ తేదీ వరకు కొనసాగుతున్నది. పేదల్లో రక్తహీనత నివారణలో భాగంగా ఫ్లోరిఫైడ్ రైస్‌ను ప్రభుత్వం పంపిణీ చేస్తున్నది. దుకాణాల్లో తీసుకున్న రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులు కొంతవాడుకుని మిగితావి విక్రయిస్తున్నారు. కొందరు ఏ మాత్రం వినియోగించకుండా పూర్తిగా అమ్ముకుంటున్నారు. ఫ్లోరిఫైడ్ బియ్యం వాడకం విషయంలో అధికారులు ప్రజలకు పలు అవగాహన కార్యాక్రమాలు ఏర్పాటు చేసినా ఫలితం ఉండటం లేదు.

అక్రమ దందా ఇలా..

అక్రమ దందాలో భాగంగా వ్యాపారులు, దళారుల సూచనల మేరకు కొందరు పట్టణాలు, గ్రామాల్లో ఆటోల్లో తిరుగుతూ కొనుగోలు చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి కిలోకు రూ. 18 చెల్లిస్తున్నారు. ఈ బియ్యాన్ని వ్యాపారులు, దళారులకు కిలోకు రూ. 20 విక్రయిస్తారు. వీటిని వ్యాపారులు నిల్వ చేసుకుని వాహనాల్లో మహారాష్ట్రకు తరలిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. మహారాష్ట్రంలో రేషన్ బియ్యం కిలోకు కనీసం రూ.24 నుంచి రూ. 26 వరకు విక్రయిస్తారు. కొందరు రేషన్ డీలర్లు సైతం లబ్ధిదారుల వద్ద నుంచి బియ్యం కిలో రూ.18 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఇలా ప్రతి నెల వందల క్వింటాళ్లలో బియ్యం పక్కదారి పడుతుండగా వ్యాపారులు, దళారులకు రేషన్ దందా లాభసాటిగా మారింది.

నిర్మల్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

భైంసాలో వినాయకునికి పూజలు చేస్తున్న ఎస్పీ జానకి షర్మిల

నిఘా నీడలో నిమజ్జనం

- నేటి నుంచి వినాయక నిమజ్జనాలు ప్రారంభం
- నేడు ముథోల్.. ఎల్లుండి భైంసా.. ఆ తర్వాత నిర్మల్..
- వినాయక శోభాయాత్రకు భారీగా పోలీసుల బందోబస్తు
- నిర్మల్, భైంసా, ఖానాపూర్‌లలో సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు
- ముథోల్‌లో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 12 : వినాయక నిమజ్జనోత్సవాల్లో భాగంగా శోభాయాత్రలను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. ఇందుకోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గతంలో శాంతి భద్రతలకు భంగం కలిగించిన రౌడీషీటర్లపై నిఘా పెట్టారు. ప్రతి వినాయకుడి వద్ద సెక్టార్‌ను ఏర్పాటు చేసి గ్రామస్తులతో అనుసంధానం చేస్తున్నారు. ముథోల్‌లో ఎస్పీ జానకి షర్మిల నిమజ్జన శోభాయాత్రను శుక్రవారం ప్రారంభించనున్నారు. కాగా.. పోలీసు శాఖతోపాటు మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, అగ్నిమాపక శాఖల అధికారులు సమన్వయంతో ఘటనలు జరగకుండా చూస్తున్నారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాలను ప్రధాన సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించారు. ఈ ప్రాంతాల్లో ప్రతి వినాయకుడి శోభాయాత్ర వద్ద ఎస్సై స్థాయి బందోబస్తు ఉండనున్నారు. వీరితో పాటు స్పెషల్ బ్రాంచి పోలీసులు మఫ్టీలో ఉంటూ భద్రతను పర్యవేక్షించనున్నారు. ఆలయాలు, మసీదులు, చర్చీల వద్ద పోలీసులు పికెట్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

సీసీ కెమెరాలు కంట్రోల్ రూంకు అనుసంధానం

నిర్మల్, భైంసా, ముథోల్, ఖానాపూర్ పట్టణాలతోపాటు మండల కేంద్రాల్లో దాదాపు 2,0 80 వినాయకులను ప్రతిష్ఠించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడు, తొమ్మిది, 11 రోజుల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. ముథోల్‌లో 21 సీసీ కెమెరాలు, భైంసాలో 215, ఖానాపూర్‌లో 35, నిర్మల్‌లో 42 సీసీ కెమెరాలతోపాటు సోలార్ కెమెరాలను కూడా అమర్చారు. సోలార్ సీసీ కెమెరాలు విద్యుత్ లేకున్నా 24 గంటలు నిఘాను ఉంచుతాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో తాత్కాలిక సీసీ కెమరాలను ఏర్పాటు చేసి ఉత్సవాలను ప్రశాంతంగా చేపట్టేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాకు చేరుకోనున్న బలగాలు

ఇప్పటికే 700 మంది పోలీస్ ఫోర్స్ ఉండగా.. అదనంగా 600 ఫోర్స్‌ను కేంద్ర బలగాలను జిల్లాకు రప్పిస్తున్నారు. ఈ ఫోర్స్ రెండు రోజుల్లో జిల్లాకు చేరుకుంటుందని అధికారులు చెబుతున్నారు. ముథోల్‌లో ఏడో రోజు, భైంసాలో తొమ్మిది రోజు, నిర్మల్, ఖానాపూర్‌లలో 11వ రోజు నిమజ్జనాన్ని చేపట్టనున్నా రు. ఇందుకోసం జిల్లా పోలీస్ సిబ్బంది 220 మందితోపాటు ఇతర ప్రాంతాల నుంచి 600 మొత్తం 820 మంది విధులు నిర్వహించనున్నారు. భైంసాకు 600 మంది బయట నుంచి వచ్చే ఫోర్స్, జిల్లా సిబ్బంది 240 మొత్తం 840 మంది శోభాయాత్రకు భద్రతను ఏర్పాటు చేశారు.

ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తాం..

-ఎస్పీ జానకి షర్మిల, నిర్మల్

నిర్మల్ జిల్లాలోని భైంసా, నిర్మల్‌లలో వినాయక నిమజ్జన శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. ముస్లిం మతపెద్దలు, వినాయక మండపాల నిర్వాహకులు, ఉత్సవ సమితి సభ్యులతో శాంతి సమావేశాలను ఏర్పాటు చేశాం. శోభాయాత్రకు ఉత్సవ సమితి సభ్యులు, మండపాల నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

కోశగుట్ట ఆశ్రమ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- ఆకస్మికంగా ఆశ్రమ పాఠశాలల తనిఖీ

పెంబి, సెప్టెంబర్ 12 : ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సూచించారు. గురువారం పెంబి బాలికల ఆశ్రమ పాఠశాల, కోసగుట్టలోని బాలుర ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గది, పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు అర్థమయ్యే విధానంలో విద్యను బోధించాలని సూచించారు. పాఠశాలలో ప్రాథమిక చికిత్స ఔషధాలను అందుబాటులో ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తరగతి గదులు, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలన్నారు.

ఏమాయికుంట జీపీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్టీల్ బ్యాంక్ ప్రారంభం
- కలెక్టర్ రాజర్షి షా

ఏమాయికుంటలో ఇందిరా మహిళా శక్తి స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 12 : ఏమాయికుంట గ్రామ పంచాయతీ(జీపీ) పరిధిలో అన్ని రకాల అభివృద్ధి పనులు చేసి, పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం ఏమాయికుంటను సందర్శించారు. అభివృద్ధి పనులతోపాటు చేసిన పలు రకాల పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళాశక్తి కార్యక్రమం ద్వారా టెంట్ హౌజ్‌కి సంబంధించిన సరస్వతి స్టీల్ బ్యాంక్‌ను కలెక్టర్ రాజార్షి షా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్, మహిళా శక్తి సంఘం మహిళలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజార్షి షా మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేధించాలని, పర్యావరణాన్ని రక్షించాలన్నారు. గ్రామాలకు చెందిన ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి, ఆదర్శ గ్రామ పంచాయతీగా అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో సాయన్న, ఎంపీడీవో భాస్కర్, ఎంపీవో సమీర్ హైమద్, మాజీ సర్పంచ్ జాదవ్ లఖన్‌సింగ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, ఈజీఎస్ ఏపీవో జాదవ్ శ్రీనివాస్, ఐకేపీ రామారావు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఉట్నూర్ రూరల్, సెప్టెంబర్ 12 : పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం గొట్టిగోండ్ గూడలో గల అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషణమాసం కార్యక్రమంలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 30 వరకు పోషణ అభియాన్ కార్యక్రమంలో పోషణ లోపాన్ని అధిగమించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో మిల్కా, మండల ప్రత్యేక అధికారి సుధాకర్, మాజీ సర్పంచ్ పెందూర్ కళావతి, ఎంపీడీవో రాంప్రసాద్, ఎంపీవో మహేశ్, ఈజీఎస్ ఏపీవో రజినీకాంత్ పాల్గొన్నారు.

శాంతియుతంగా జరుపుకోవాలి

మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

ఎస్పీ జానకి షర్మిల

భైంసా, సెప్టెంబర్ 12 : భైంసా పట్టణంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో గణేశ్ నిమజ్జనాన్ని జరుపుకోవాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ముస్లిం మత పెద్దలు, మజీద్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. వారి నుంచి సమస్యలు, సలహాలను అడిగి తెలుసుకున్నారు. డీజేల భారీ శబ్దాలతో ఇబ్బంది ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని పలువురు ఎస్పీని కోరారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. భైంసాలో గణేశ్ నిమజ్జనాన్ని పండుగ వాతావరణంలో జరిగేలా ఇరువర్గాలు సహకరించాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తేవాలని, సత్వర పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. భైంసా యువత కోసం స్థానికంగా లైబ్రరీ ఏర్పాటు చేస్తామని, చదువుకున్న యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారెవరైనా ఊపేక్షించేది లేదన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ అవినాశ్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాబీర్ అహ్మద్, ఆర్డీవో కోమల్ రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, కమిషనర్ రాజేశ్, పట్టణ సీఐ రాజారెడ్డి పాల్గొన్నారు.

రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో అరుదైన ఆపరేషన్

- ట్యూమర్‌ను విజయవంతంగా తొలగించిన వైద్యులు
- ఉచితంగా వైద్య సేవలు
- డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్యులు

ఆదిలాబాద్, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యులు అరుదైన ఆపరేషన్ చేశారు. గురువారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్యులు వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్‌కు చెందిన 26 సంవత్సరాల యువకుడికి పక్కటెముక వద్ద ట్యూమర్ వచ్చిందని.. ట్యూమర్ గుండెకు, ఉపరితిత్తులకు అంటుకుని ఉందన్నారు. బాధితునికి రిమ్స్‌లోని బయాప్సీ నిర్వహించి విజయవంతంగా ఆపరేషన్ చేసి ట్యూమర్‌ను తొలగించినట్లు అంకాలజీ సర్జన్ జక్కుల శ్రీకాంత్ తెలిపారు. సర్జరీ సమయంలో ఉపరితిత్తులు, గుండెకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ఇలాంటి కేసులకు రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో వైద్యం అందుతున్నందున ప్రజలు హైదరాబాద్, మహారాష్ట్రలోని నాగ్‌పూర్, యావత్మాల్ వంటి ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడ చికిత్స పొందాలని సూచించా రు. ప్రైవేటులో రూ.6 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. అంకాలజీ సర్జన్ ఆధ్వర్యంలో వైద్యుల బృందం ఎనిమిది గంటలు ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. రెండు రోజుల్లో బాధితుడిని డిశ్చార్జి చేస్తామన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు రిమ్స్‌లో వివిధ వ్యాధులకు సంబంధించిన 2, 65 ఆపరేషన్లు చేశామని.. ఇందులో ఈఎన్‌టీ 1047, యూరాలజీ 787, అంకాలజీ 63, పీడియాట్రిక్ సర్జరీ 213, న్యూరో సర్జరీ 1, ప్లాస్టిక్ సర్జరీ 90, జాయింట్ రిప్లేస్‌మెంట్ 4, ఈసీటీ 80, ఇతర సర్జరీలు ఉన్న ట్లు డైరెక్టర్ తెలిపారు.

ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

బజార్‌హత్నూర్ ఆసుపత్రిని సందర్శించిన డీఎంహెచ్‌వో కృష్ణ

బజార్‌హత్నూర్, సెప్టెంబర్ 12 : బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డీఎంహెచ్‌వో కృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ, మారుమూల మండలవాసులకు నాణ్యమైన వైద్యసేవలను అందించాలని తెలిపారు. స్థానిక వైద్యాధికారి భీంరావు ఆసుపత్రిలోని సిబ్బంది, మందుల కొరత గురించి డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకొచ్చారు. సిబ్బంది, మందుల కొరత లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో సూర్యప్రకాశ్, హెల్త్ అసిస్టెంట్ రమేశ్, ల్యాబ్ టెక్నీషియన్ రవి, సూపర్‌వైజర్ రాణి పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి

డీఐఈవో పరశురాం

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 12 : భవిష్యత్‌లో విద్యార్థులు సెటిల్ కావడానికి ఇంటర్ దశ కీలకమని విద్యార్థులు బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని జిల్లా మాధ్యమిక విద్యాశాఖ అధికారి పరశురాం అన్నారు. గురువారం నిర్మల్ పట్టణంలోని శాంతినగర్ కాలనీలో గల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన ప్రెషర్స్ పార్టీ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

జూనియర్ కళాశాల తనిఖీ

సారంగాపూర్, సెప్టెంబర్ 12 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా మాధ్యమిక విద్యాధికారి పరశురాం తనిఖీ చేశారు. అనంతరం అధ్యాపకులతో సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు వచ్చేటట్లు చూడాలని సూచించారు. ఇందులో ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్నను హత్య చేసిన తమ్ముడు

నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 12 : తాగుడికి బానిసై ఇంట్లో వాళ్లను ఇబ్బందులకు గురి చేస్తున్న అన్నను తమ్ముడు హత్య చేసిన ఘటన నిర్మల్ పట్టణంలో చోటు చేసుకున్నది. వివరాలను డీఎస్పీ గంగారెడ్డి వెల్లడించారు. పట్టణంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మీ వాడకు చెందిన డుర్రె శివాజీ అలియాస్ శివ, డుర్రె సాంబాజీలు ఇద్దరు అన్నదమ్ములు. సాంబాజీకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసైన సాంబాజీని భార్య విడిచి పెట్టి వెళ్లింది. శివకు కూడా పెళ్లి కాగా.. భార్య వదిలి వెళ్లడంతో వీరంతా తల్లి వద్ద ఉంటున్నారు. సాంబాజీ తాగుడికు బానిసై రోజు తన తమ్ముడితో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంటి వద్ద సాంబాజీ తన తమ్ముడైన శివను డబ్బులు ఇవ్వమని గొడవ చేశాడు. క్షణికావేశంలో శివాజీ వద్ద ఉన్న గొడ్డలిని తీసుకుని సాంబాజీ(35) తలపై కొట్టగా అక్కడిక్కడే చనిపోయాడు. బాధితుడి అక్క ఫిర్యాదు మేరకు శివను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. హత్య కేసును చేధించిన పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్‌ను డీఎస్పీ అభినందించారు.